# సన్మానం

యూత్ క్లబ్ కార్యాలయం కోలాహలంగా ఉంది. ప్రెసిడెంటు సాంబమూర్తి వేసిన నవ్వురాని జోకుకి పగలబడి నవ్వారు మెంబర్లు. ఆయన కూడా శ్రుతి కలిపాడు.

సాంబమూర్తికి దాదాపు నలభై ఎనిమిదేళ్ళుంటాయి. అయితేనేం గత పదేళ్ళ నుంచీ క్లబ్‌కి తిరుగులేని, ఎదురులేని ప్రెసిడెంటాయన. ఆ మాటకొస్తే యూత్‌క్లబ్బులోని మెంబర్లంతా నలభై పైబడ్డ వాళ్ళే.

అయినా సాంబమూర్తినిగాని, ఆయన చర్యల్ని గాని, ఆయన కుళ్ళు జోకుల్ని గాని విమర్శించకపోవడమే కాదు - విమర్శించాలనే అనుకోరెవరూ. అంతటి పేరు ప్రఖ్యాతులు ఉన్నాయతనికి. కాన్వెంటు సీటు నుంచి గ్యాస్ సిలిండర్ వరకూ ప్రతీదీ క్లబ్బు మెంబరుకి తేలిగ్గా పనైపోతోందీ అంటే అది శ్రీమాన్ సాంబమూర్తిగారి చలవే మరి.

అంతేకాదు. సినిమా డైరెక్టర్నుంచి ఇన్‌కమ్‌టాక్స్ ఆఫీసరు వరకూ, మంత్రిగార్నుంచి మున్సిపల్ కమీషనర్ వరకూ అంతా ఆయనకి ఋణపడి ఉన్నా మంటారంటే ఆయన 'పట్లూ', 'శక్తియుక్తులూ' అలాంటివి.

రోజువారీ కొలువు దీర్చి కులాసాల హాసాల తేలుతూండగా ఓ బుల్లి సభ్యుడు "నేతాజీ యువజన సంఘం వాళ్ళు యమ్మార్ కాళ్ళకి అభినందన సభ ఏర్పాటు చేస్తున్నార్టండీ" అన్నాడు ముక్కుతో నొక్కుతూ.

"ఏమీ?" అన్నట్టు యన్టీఆర్ దుర్యోధనుల్హా చూసి "మన కళ్ళల్లో పడని 'కాళ్ళ' ఎవడూ? ఏమా కథ?" అని ప్రశ్నించారు సాంబమూర్తి.

"కాళ్ళ మృత్యుంజయరావనీ ఓ డాక్టర్లెండి అమెరికాలో ఉంటున్నాడు. మొన్ననే అన్నగారి కూతురి పెళ్ళని వచ్చేడు"

"అమెరికాలో ఉంటున్నాడా? చెప్పేవు కాదేం పదపద....."

వెంటనే వివిధ వాహనాల మీద బయల్దేరారు ముఖ్యులంతా.

కాళ్ళగారు కించిత్తు ఆశ్చర్యంగా చూసినా అదేమీ కన్పించకుండా దాచుకుని ఆహ్వానించారు.

"మా యూత్ క్లబ్ తరపున రేపు మీకు సన్మానం చేస్తున్నాం. రేపటి మీ కార్యక్రమాలన్నీ కాన్సిల్ చేసుకుని మాతో సహకరించాలి"

సాంబమూర్తి ధోరణికి కొంచెం హర్టయ్యారాయన. డాక్టర్ గనుక అతని తత్వం అర్ధమవ్వగా నవ్వుతూ అన్నారు - "నాకు సన్మానం ఏవిటండీ? సారీ, నాకేం వద్దు... పోనీ ఎంతో అభిమానంతో వచ్చారు గనుక ఓ పని చెయ్యండి. నేను హార్ట్ స్పెషలిస్టుని. హార్ట్ డిసీజెస్ అండ్ ట్రబుల్స్ ఉన్న వాళ్ళకి ఎడ్వైజ్ చెయ్యగలను. ఇక్కడి డాక్టర్లు సాయపడితే ఆపరేషన్లు కూడా చేస్తాను. అంచేత మీరు కేంప్ నిర్వహిస్తే బాగుంటుంది..."

"అలాంటి పనులు మేం చెయ్యమండీ. లయన్స్ క్లబ్బూ, రోటరీ క్లబ్బూలాటివి చేస్తాయి. మీరు మా సన్మానానికి ఒప్పుకొని తీరాల్సిందే?"

"ఎందరో పెద్దలూ, అనుభవజ్ఞులూ, ఇతరత్రా ప్రముఖులూ ఉండగా నాకు సన్మానం చెయ్యడం..."

వింత మృగాన్ని చూసినట్టు చూశారు సాంబమూర్తీ ఆయన అనుచరవర్గమూ.

సన్మానం వద్దన్న మానవుణ్ణి తమ జీవితంలో ప్రప్రథమంగా చూస్తున్నారాయె!

"చూడండి ప్రముఖుల్ని సన్మానించడం మా క్లబ్ ఆశయం. కొందరు కిట్టనివాళ్ళు ఏడ్చిపోయినట్టు సన్మానాలు చెయ్యడమే మా క్లబ్ ఏక సూత్ర కార్యక్రమం అనుకోండి. అంచేత మీరు ఒప్పుకోవాల్సిందే తప్పదు" ఖండితంగా చెప్పారు.

ఒప్పుకోకపోతే ఒట్టు పెట్టుకుంటారేమో అనిపించింది. పైగా తనెక్కడో సుదూర దేశంలో ఎన్నో ప్రశంసలు పొంది ఉండవచ్చు. కాని కన్న దేశంలో పుట్టి పెరిగిన ఊళ్ళో తనవారి మధ్య గౌరవం పొందటం నిజంగా అపూర్వమన్న భావం ఆశపెట్టగా అంగీకరించేశారు కాళ్ళ.

విజయగర్వంతో వెళ్ళిపోయింది బృందం.

తనెవరో ఎరుగరు. తనేం చేస్తాడో ఎరుగరు.. కడకి తన గురించి చెప్పడానికైనా నాలుగు ముక్కలు అడిగి ఎరుగరు. మరి సన్మానం చేస్తారట. సన్మానమే చేస్తారా లేక...?!

శిలా ప్రతిమలా కూర్చుండి పోయారు యమ్మార్ కాళ్ళ.

సాంబమూర్తి బృందం ఒక్కక్షణం కూడా వృథా చెయ్యకుండా వెంటనే కార్యరంగంలో కురికారు.

అమెరికా ఖండంలో ఆశేషఖ్యాతి గడించిన పదహారణాల ఆంధ్రుడూ, మన ఊరివాడూ అయిన డాక్టర్ కాళ్ళగార్కి ఘనసన్మానం చేస్తున్నామంటూ చందాలు వసూలు చేశారు.

పురోహితులకీ, పూలదండలకీ, సన్నాయి మేళానికీ అడ్వాన్సు లిచ్చారు.

'వృద్ధనారీ పతివ్రతా' అన్నట్టు గతమంతా జంపింగులతో నిండి ఉన్నా ప్రస్తుతం నీతులూ గట్రా చెబుతూ చావుకీ పెళ్ళికీ స్టేట్‌మెంట్లిస్తూ కాలక్షేపం చేస్తున్న ఓ మాజీ నాయకుణ్ణి సభాధ్యక్షుడిగా కరపత్రంలో ప్రింటు చేయించారు.

కొత్తగా వచ్చిన కలెక్టరుతో పరిచయం పెంచుకోడానికిగ్గాను ఆయన సతీమణిని ముఖ్య అతిథిగా ఆహ్వానించారు.

మర్నాడు సాయంత్రం ఆరున్నరకి మొదలవ్వాల్సి ఉంది సన్మాన సభ. కాని ఏడున్నరకొచ్చి కాళ్ళగార్ని తీసుకెళ్ళారు.

సభకి జనం రానందున ఆయన్ని లోపలి రూములో కూలేసి కబుర్లలో పడ్డారు క్లబ్ వాళ్ళు.

తను అనే వాడక్కడ ఉన్నట్టు గాని, తను ఆనాటి కార్యక్రమానికి ముఖ్యుడనిగాని పట్టించుకోకుండా వాళ్ళు ప్రవర్తిస్తుంటే బాధగా అనిపించింది. సన్మానాని కొప్పుకుని చాలా తప్పు చేశానన్న భావం అతని నరనరాన్నీ నమిలెయ్యసాగింది.

ఎనిమిదీ పది చూపిస్తోంది వాచీ.

చాలా విసుగ్గా, అసహనంగా ఉంది కాళ్ళకి.

ఇదే అమెరికాలో అయితే... తనిలా నిర్వ్యాపారుడిగా కూర్చుంటాడా? నెవ్వర్! తనే కాదు ఎవ్వరూ కూడా ఇలా కాలాన్ని కాలక్షేపం బఠానీల్లా నమిలెయ్యరు. వారానికి అయిదు రోజులు, రోజుకి ఎనిమిది గంటల చొప్పున ఖచ్చితంగా పని చేస్తారు. శని, ఆదివారాల్లో కుటుంబ సభ్యుల్తో, స్నేహితుల్తో విహరిస్తారు. ప్రతి క్షణం కూడా ఎంతో విలువైనదిగా భావిస్తారు.

కానిక్కడ దానికి పూర్తి వ్యతిరేకం!

ఒక్కోసారి అమెరికాలో తను - పరాయి దేశంలో వర్ణవిచక్షణ గల సమాజంలో పెట్టుబడి, లాభం వ్యవస్థలో ఒంటరిగా ఉన్నట్టు, రక్షణ లేనట్టు ఉండే వింత అనుభూతి ఫీలవుతూంటాడు. అటువంటప్పుడు స్వదేశంలో ఉండే వాళ్ళెంత ధన్యులో, అదృష్టవంతులో,

మరెంత స్వేచ్ఛాజీవులో అనుకుంటూంటాడు. కాని వీళ్ళకి స్వేచ్ఛంటే అర్థం తెలీదు. ఆత్మగౌరవమంటే ఏమిటో అర్థంకాదు. దేశమంటే భక్తి లేదు. తోటి జనమంటే లెక్కలేదు.

కొందరనుకోవచ్చు. అంత ఇష్టం లేకుండా మరో దేశంలో ఉద్యోగం చెయ్యాల్సిన పనేమిటని? నిజమే - కాని తను కేవలం ధనం కోసం దేశం దాటలేదు. జ్ఞానతృష్ణతో పరుగెట్టాడు. తన నైపుణ్యాన్ని పెంచుకోడానికి పరిశోధనా కాంక్షని తృప్తి పర్చుకోడానికి సమస్త మానవాళికీ ఏదో చిన్న సైజు మహోపకారం చెయ్యాలన్న మహాసంకల్పంతో వెళ్ళాడు. సాంఘిక సామాజిక ఆటుపోటులకు తట్టుకుని స్పెషలిస్టుగా మన్ననలందు కున్నాడు దేశంకాని దేశంలో!

"ఎవరు కావాలి?"

ఆలోచనామాలిక తెగిపోగా సాభిప్రాయంగా చూశారతని వంక కాళ్ళ.

అతను రెట్టిస్తూ అడిగాడు- "సాంబమూర్తి గారి కోసమా?"

ఇబ్బందిగా చూశాడు కాళ్ళ.

ఇంతలో కలెక్టరు గారి భార్యని దగ్గరుండి జాగ్రత్తగా తీసుకొచ్చాడు సాంబమూర్తి.

"వీరే యమ్మార్ కాళ్ళ అనీ అమెరికా డాక్టరు. వీరినే ఇవాళ సన్మానిస్తున్నాం"

నమస్కార ప్రతి నమస్కారాలయ్యాయి.

పేరంటాని కొచ్చినట్టు పట్టుచీరతో ముస్తాబై వచ్చిందావిడ.

"జనం పల్చగా ఉన్నారండి. అసలు గొప్ప పొరపాటు జరిగిందిలెండి. సినిమా యాక్టరొస్తున్నాడని ప్రచారం చేసి ఉంటే సరిపోయేది" అని నవ్వి ఆవిణ్ణి ఓ ప్రత్యేక ఆసనంలో కూర్చోమన్నారు.

డ్రింక్సనీ, అదనీ, ఇదనీ హడావిడి చేస్తున్నారంతా ఆవిడ చుట్టూ చేరి. కొందరప్పుడే కలెక్టర్‌గారి భజన మొదలెట్టారు.

"ముఖ్యఅతిథిగా కలెక్టర్‌గారి భార్యను పిలిచారేం?" కాళ్ళ అడిగాడో సభ్యుణ్ణి.

"కలెక్టరు గారి భార్య కదా?"

"కలెక్టరు గారికి విలువ గాని మధ్యన ఈవిడ కేమిటి?"

"కలెక్టరు గారి భార్య కావడమే"

"ఆవిడేం చదివిందిట? ఆవిడ క్వాలిఫికేషనేమిటో..."

"కలెక్టర్ గారి భార్య అవడమే".

"ముఖ్య అతిథి కదా, నాలుగు ముక్కలు చెప్పడం వచ్చా లేక ఉత్సవ విగ్రహంలా..."

"ఏమైనా ఆవిడ కలెక్టరు గారి భార్య..."

మరి మాట్లాడలేకపోయాడు కాళ్ళ.

ఒక పెద్ద ఉద్యోగిని, నాయకుణ్ణి, సంఘ సేవకుణ్ణి గౌరవించడంలో అర్థం ఉంటుంది కాని భార్యల్నీ గౌరవించడం ఏమిటో, ఎందుకో అర్థం కాలేదతనికి.

"ఏమనుకోకండి డాక్టరు గారూ. ఇంకో అరగంటలో మొదలెట్టేద్దాం. అన్నట్టు అమెరికాలో ఉంటున్న మన ఫ్రెండ్సు మా అబ్బాయి నక్కడికి పంపించెయ్యమంటున్నారు డాక్టరు గారూ. డిగ్రీ తప్పేడన్న మాటేగాని మాంచి తెలివైన బుర్రలెండి. ఒక నెల రోజుల నుంచి కంప్యూటరు కోర్సు నేర్చుకుంటున్నాడు. మీరెలాగో వాణ్ణి అమెరికా లాక్కెళ్తే చాలు వాడు బాగా షైనైపోతాడు. మీరు కాదనరనుకోండి. అయినా అడగటం నా ధర్మం కదా?"

సాంబమూర్తి మాటలకి అవాక్కైపోయాడు కాళ్ళ. ఇతను చేస్తున్న సన్మానం తనకా, అతని అవకాశవాదానికా?

ఇంతలో ఎవరో అతన్ని పిలవడంతో జవాబు ఇచ్చే బాధ్యత తప్పింది కాళ్ళకి.

క్లబ్బు లోపలా, ఆవరణలోనూ కోలాహలం తిష్ట వేసుక్కూర్చుంది. ఏం చేస్తున్నారో, ఎందుకు చేస్తున్నారో ఎవరికీ తెలీదు. కానేదేదో చేసేస్తున్నారు. నలు మూలలా రణగొణ ధ్వని

"డాక్టరుగారెక్కడ బాబూ?" ఒక బీద ముసలావిడ వాళ్ళనీ, వీళ్ళనీ అడుగుతూ వచ్చింది.

"డాక్టరూ లేరు, ఎవ్వరూ లేరు. వెళ్ళెళ్ళు. అసల్నిన్ను లోపలికెవరు రానిచ్చారు?" కళ్ళెర్ర జేశాడో కార్యకర్త.

ఆవిడ కాళ్ళా వేళ్ళా పడుతోంది గాని కనికరించలేదతడు.

అంతా గమనిస్తోన్న కాళ్ళ చూస్తూ ఉండలేకపోయాడు. పైగా ఆవిణ్ణి చూస్తోంటే భారతమాత గుర్తుకొస్తోందతడికి.

"ఏమ్మా - నేనే డాక్టర్ని. ఏం కావాలి?"

ఆవిడ చేతులు జోడించింది. అర్థించింది. ఏడ్చింది.

ఆవిడకీ, ఆవిడ కుటుంబానికీ ఏకైక ఆధారమైన కొడుకు ప్రభుత్వ ఆసుపత్రిలో గుండెజబ్బుతో బాధపడుతున్నాడు. ఆపరేషన్ చెయ్యగల సమర్థుడక్కడ లేకపోయినా

ఆపరేషన్ మొదలుపెట్టి విఫలురయ్యారు. డాక్టర్ కాళ్ళ ఊళ్ళో ఉన్నారనీ, ఆయన్ని తీసుకొస్తే కొడుకు బ్రతకొచ్చనీ పరోక్షంగా చెప్పి పంపించారావిణ్ణి.

అతని కళ్ళల్లోకి నీళ్ళుబికి వచ్చాయి.

నా ఈ దేశంలో ఇలాంటి అభాగ్యులెందరో! తన వాళ్ళకుపయోగపడని చదువూ, నైపుణ్యం ఎందుకు? తనలాంటి వాళ్ళు అమెరికాలో కోకొల్లలుగా ఉన్నారు. కాని ఇక్కడ అతికొద్ది మంది ఉన్నారు. వాళ్ళైనా సామాన్యుల కందనంత ఎత్తులో ఉన్నారు. నిజంగా తన అవసరం ఇక్కడే ఎక్కువగా ఉంది.

అతని మనస్సులో ఏవేవో ఆలోచనలు ఊపిరిపోసుకుంటుంటే – "పదమ్మా" అన్నాడు కాళ్ళ.

"మీకేమైనా పిచ్చెక్కిందా? ఇవతల సన్మానం పెట్టుకుని తగుదునమ్మా అని ఆపరేషన్ చెయ్యడానికి వెళ్తారా?' విసురుగా వచ్చి అన్నాడు సాంబమూర్తి.

"క్షమించండి. మీకు కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నాను. కానీ నా గౌరవం కన్నా నా వృత్తి గౌరవం గొప్పదండి. నా వృత్తి ధర్మాన్ని నిర్వర్తించనివ్వండి"

విసవిసా నడిచాడు డాక్టర్ మృత్యుంజయరావు.

గాలి చొరని చీకటి కొట్లోంచి విశాల ప్రదేశంలో అడుగు పెట్టినట్టుందతడికి.

కళ్ళల్లో ఆనంద భాష్పాలు మెరుస్తోంటే అనుసరించిందా ముసల్ది – వెయ్యేళ్ళు చల్లగా బ్రతకమని పెద్ద మనస్సుతో దీవిస్తూ.

"నిజంగా పిచ్చోళ్ళా ఉన్నాడోయ్. లేకపోతే సన్మానాన్ని కాలదన్ని వెళతాడా? అమెరికా డాక్టరు కదా – బంగారు గుడ్లు పెట్టే బాతుకదాని చంకలు కొట్టుకుంటున్నాను. కనీసం క్లబ్బు కొత్త బిల్డింగు కోసం పాతికవేలైనా డొనేషన్ ప్రకటిస్తాడు సన్మాన సభలో అనుకున్నాను. ఫ్చ్!......"

సాంబమూర్తి మాటలు చెవినబడకపోవడం ఆ గుండె నిపుణుడి గుండె అదృష్టం!

**(ఆంధ్రప్రభ వార పత్రిక 2.9.1987)**